# దీక్ష

"కవర్డ్ — యూ...డర్టీ కవర్డ్ —".

—కలత నిదురలో వెన్ను చరచినట్టుగా అయి, ఉలిక్కి పడుతూ, పక్కమీదనుంచి క్రిందకు దొర్లి, లేచి కూర్చుని మూసిన కనులతోనే... కలలో మెరసిన దీనపుచూపులను మనసులో తాండవించుకుంటూ మళ్ళా పారాయణకు ఉపక్రమించాడు... కవర్డ్...

ఆమే!... అవే నీరోడేకన్నులు... అవే పరివేదనతో బ్రతిమాలేచూపులు... నన్ను 'మరచిపోకండి' అని, పాలిపోయిన పెదవులమీద, మందారమాలలైన పలుకులు... కనుమూసినప్పటినుంచీ అదే కల !

తెలుసును... ఉభయులకున్నూ, ఈ జన్మకు తిరిగి కలుసుకోవడం వుండదేమోనని... తెలుసును అశుభసూచనలతో గుండె వుండివుండి ఝల్లుమంటూంది. మరునాడు ఉదయం బయలుదేరుతుందనగా... తెల్లవార్లూ, బాల, మంచాన్ని ఆనుకుని కటిక నేలమీద కూర్చుని... 'నన్ను పంపమాకండీ! నాకేమో భయంగా, తగనిదిగులుగా ఉంది; ఏమైనాసరే, మీ దగ్గరనుంచి పంపేయకండి'... అని ఎంత వేడుకుంది... బండి ఎక్కేటప్పుడు,...ఎలా విలపించింది... కడసారి... ఏలా చూసింది!

ధైర్యంచేసి... తండ్రిమాటకు ఎదురుఆడి...భార్యను పంపకుండా నిలుపుకునే సాహసం, అప్పుడు లేకపోయింది! తరువాత... ఎన్నిసార్లు ప్రయాణమైనా... ఆయన అనుగ్రహించి పైసారాల్చందే... ఎక్కడికి కదలడం?... ఉత్తరం వ్రాయడానికి అణాడబ్బులకు గతిలేనివాడికి... ఊరి ప్రయాణానికి...

చివరకు... జబ్బుచేసిందని, టెలిగ్రాం వచ్చినా, అప్పుడయినా, ఆ ధన—కిరాతుడిగుండె కరగిందా? డబ్బే ప్రాణం... పాతబాకీ వసూలుచేసుకోవడం ముఖ్యం కాని ...ప్రాణం ఎక్కువా?—పోయిందని...... సుఖప్రసవం కాలేక, ఎంతో కష్టపడిపోయిందని... తెలిసిన తరువాతకూడా, ఏమనుకున్నాడు... చిలికలు వాలికలైన పాతపంచ పారేసే టప్పుడు పడే బాధంత అయినా ఆయనకు లేకపోయిందే?... కోడలు పోయిందనికాదు... ఇక వియ్యాలవారిదగ్గరనుంచి డబ్బుగుంజడానికి వీలులేకుండాపోయిందని... విచారం!

కిరాతుడు... ఆయనకడుపున పుట్టికూడా ఆ బండ తనం ... మనసు — రాయి — తనం, తనకు ఎందుకు అబ్బిందికాదు? వెధవడబ్బుకోసం... ఆయన, ఎన్నిప్రాణాలైనా దిగదుడిచి బలివేస్తాడే... ప్రాణానికి ప్రాణమైన— బాలను కాపాడుకునేందుకు... ఆ తండ్రికి కొడుకు... తా నేం చేయగలిగాడు?... ఏమీచేతకాని... తెగ తెంపులు లేని ... కవర్డ్.

ఎల్లకాలమూ, అలా పరాన్నభోజనం చేస్తూ...భూభారం వృద్ధిచేస్తూ... కన్నవారి వంటయింటి కుందేలుగా

...జీవనం చేసేవాడేమో? కాని... గొర్రెను మేపి మేపి, కసాయివాడికి అప్పజెప్పకుండా ఊరుకునే కరుణాళువా... ఆ తండ్రి! పుట్టగానే, తల్లి కరవైన, ఆ పసిపాపసంగతి యిక తలచకూడదూ?... మళ్ళా కొత్తపెళ్ళికొడుకు కావాలీ?—

అయేవాడేమో — ఏమో, తండ్రిమాటను ... కాదనే నిబ్బరం ఎక్కడ ఏడ్చింది? కాని... ఆమెకన్నులు ...బాల చివరసారి చూసిన చూపు...

ఎదిరించి ఆ పంచక్రింద ఒకక్షణం నిలువలేదు...... తండ్రి చిట్టెడువుప్పు దక్కనియ్యడు... పోట్లాడుతూనే... అక్కడనే వుండగలతాహాతు... తనపిల్లను తెచ్చి పెంచుకుంటూ... తనకు రావలసినదేమో నిలవేసి గుంజుకుని... ఆ యింటిపట్టునే ... ఆ పోరులోనే కాలక్షేపంచేయగల తాహాతు... లేదు.

కట్టుబట్టలతో... ఎవరితోనూ చెప్పకుండా, ఎక్కడికి వెళ్ళుతూన్నదీ తెలియనీకుండా... చేత కానీలేకుండా ...నానాబాధలూపడి, పట్నంచేరుకుని...తిండికిమాడి, తల దాచుకునే చోటులేక, ఆదరించే దిక్కులేక, మలమల మాడి పోయి... ఇన్నాళ్ళకు, ఓపూట కడుపునిండే కొలువుకు కుదిరి ... కాలం ఏలాగో గడుపుకుంటున్నాడు.

సుఖపడాలని కోరికలేదు... అంతకన్న మంచిఉద్యోగం...వుండటానికి వసతీ దొరకాలనీ...విద్యకు తగినలాభ్య కలగాలనీ ఆపేక్షలేదు. అనకతవక జీవితంవల్ల పడినకష్టాలు ...మరచిపోవాలని లేదు.

కవర్డ్ —

నమ్మినఅమాయకురాలిని రక్షించుకోలేకపోయినాడు ...వెళ్ళకపోతే, బ్రతికేదేమో! రమ్మని ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, తండ్రికిఝడిసి, వెళ్ళి చూడనన్నా లేకపోయినాడు. తండ్రి కారాలూ మెరియాలూ నూరుతాడని... కరువుదీర ఏడువనన్నా లేకపోయినాడు...ఆయింట్లో—కవర్డ్- ఎందుకు వచ్చిన ఏళ్ళు...ఎందుకువచ్చిన చదువు...

ఇక్కడ ఒకసుఖం...తండ్రిభయం లేదు...ఎప్పుడూ బాలను తలచుకోవచ్చును... కలలో... ఆమెచూపులు మననంచేసుకుంటూ దద్దరిల్లిపోవచ్చును.

ఎవరితోనూ స్నేహంలేదు... ఏ జోక్యానికీ పోవడం లేదు. అనుభవంవల్ల పరిపాటి అయిపోయి... మరపువచ్చి నప్పుడల్లా... బాలచూపులు మెలకువతెప్పించాలి...కవర్డ్ —అని జ్ఞాపకంచేయాలి!

—మనసులో కణకణలాడుతూన్న అధీర భారంతో రెళ్ళు జేగురుముద్దలైపోయినవి: ములుగఱ్ఱతో పొడిచినట్టు శీతాకాలం సూర్యకిరణాలు... తలుపులూడిపోయిన కిటికీ గుండా చొరుచుకువచ్చి రెప్పలమీద కుమ్ముతూన్నవి. అల్లార్చి ... చూపు తెమల్చుకుని... అరచేతులతో కను లద్దుకుని... కర్మసాక్షికి అంజలిపట్టి పక్కను మోచేతుల మీద ఆనిన ఊపులో లేచి నిలుచుని ... లుంగి బంధించు కుని... లోకంలోకి దిగిపోయినాడు.

స్టవ్ రగిల్చి ... స్నానం అదీ చేసి వచ్చేశాడు: పాలు అందుకుని ... కాఫీచేసుకు త్రాగి ... సిగరెట్‌కోసం

వెదికి...ఖాళీపెట్టెను మూలకువిసిరికొట్టి...దిగివెళ్ళి తెచ్చు కునేందుకు ఓపికచాలక రాత్రి చూడటంమరచిపోయినపత్రిక చేతపుచ్చుకుని తిరగవేస్తూ ... కుర్చీలో జార్లపడినాడు. తిరగపడి, ఒళ్లో పరచుకుపోయిన 'హింమూ' వెనకపీటీఅంతా ...మోపెడేసి పూలదండలతో, భుజాలు రాచుకుంటూ ఎగుడుదిగుడుగా నిలుచున్న ... నూతనదంపతులమయం. అవి, కళ్ళకు ముళ్ళులాగా గుచ్చుకోగా, పేజీ, గొగ్గిఅంచు గుప్పెటలో పట్టి...చీల్చేస్తూ...అలాటి ప్రచురానందం ...గడ్డకట్టుకుపోయిన తనగుండెల్లో త్రెళ్ళించిన అసహ్యా— వేదనా—ఉన్మాదానికి ... తెప్పిరిల్లిన మనసులో మెరుపు లాగా...నవ్వు తెచ్చుకున్నాడు...ఆలోచనలమీదుగా... దండలు ఎడాపెడా వేసుకుని, బొమ్మముఖంలో, నందనవనీ విహారసుఖం చిందించుకునే ...వివాహ—వీరుడు ... తరు వాత...జీవితం, ఏ కారణంవల్ల...ఏలా దగ్ధమైపోయినా... ఆ కుములు ధైర్యంగా లోకానికి...ప్రకటించలేడేం ? అవు ను...ఒళ్ళంతా సంసారం ... ముళ్ళుగా గుచ్చుకుపోయిన మీదట చెంపల్లో, కావాలని తెచ్చిపెట్టుకునే రోజారేకల మెరమెచ్చు లేలా నిలుస్తవి? అదంతా...కలలు కలలని తెలుసుకోనీయని...పీడకల......

—ఇంకా కల అనుకుంటూనే ఉన్నాడు...ఎదురు గుండా...తనహోదాకు తగిన యిగిలింపుతో...తన పైఅధి కారి ... ఆయనపక్కను ... చేత పూలకొన్కతో సిగ్గు

దిగ్రమింగుకునేకళ్లు, ఓరచూపులకు మళ్ళించే...ఆయన కూతురు...

మూకాభినయంలో...భావప్రకటనం... ఆతనిమీద అంతసేపటినుంచీ పనిచేయకపోవడంవల్ల...సకిలింపు మోతాదు పెద్దదిచేసి... 'హలో' అని ఆతడు తెలివి తెచ్చుకుని ఉచిత మర్యాదచేసేలోపుగా ... స్థూలకాయం...ఉన్న ఖాళీకుర్చీలో దించేశాడు.

ఆతడు లేచి నిలుచుండగానే...ఆ అమ్మాయి పూలు దోయిలించి...అర్పించేభంగిమంలో అందించింది...వాటిని, మర్యాదగా మేజామీదకు...గుప్పిటవిడిచి...ఆయనజాపిన సిగరెట్ ఆప్యాయంగా ... తీసుకున్నాడు.

ఒకదమ్ము...ఆతడికళ్ళల్లో...వాళ్ళు అప్పుడు అలా దయచేయడం ఎందుకా అనే ఆశ్చర్యం ఊదినవి : ఆయన చూపులు ఆ రాకకు భారతగాథ అంత వెనుక అండఉన్నదనే...గాంభీర్యం తట్టించినవి.

రెండోదమ్ము...ఆతడికవళికలో ... ముదిరిపోతూన్న ...అర్థం-కాని—తనం : ఆయన మౌనంలో...ఇక నోరు విప్పవలెననే...ఆలోచన...నిశ్చయం :

—కాడలాగా పేరుకున్నకొండి, కుర్చీచేతికి చూపెట్టి ...రాలుస్తూ...ఆయన తెలివి తేటలుగా...

"వీరపూజ...చేయడానికి వచ్చాం" అని మీసాలు సర్దుకున్నాడు.

"ప్రాణదానం చేసినందుకు,... వాక్యం సగంలో

వీణె ముక్తాయించినట్లూ...చిరునవ్వూ...చూపులకు అంది పుచ్చుకోనిచ్చింది......

అలా తెల్లబోయి ... తండ్రిముఖంమీదనుంచి... కూతురివంకకు చూపు తిప్పుకుని...అప్పుడు పోల్చుకుని... అంతటితో ఆ నాటకం అర్థంఅయి...బిగ్గరగా నవ్వుతూ...

"చేయి పట్టుకుని...అంత మోటగా లాగినందుకు దండించడానికి...మీతండ్రిగారిని తీసుకురావాలిసింది కాని.. ఈ పూలపూజ లేమిటి"...అని చల్లనిగాలి చిగురించిన కొంటెతనం ఆమెమీదికి విసిరాడు.

"అంతకన్న ఏం చేయగలం?...నీవు దేవుడులాగా ...తోడుపడి రక్షించకపోతే, అమ్మాయి అక్కడా— అక్కడా కారుక్రింద పడిపోయేదేనా...ఏం ప్రత్యుపకారం చేసి నీ రుణంతీర్చుకోగలను"...అని ఆయన...ప్రాథేయపు —జవాబు.

"నేను ఆ సంగతే మరచిపోయినాను...మీ అమ్మాయిని...మీ మాటలధోరణివల్ల పోల్చడమేకాని ... ఒంటరిగా కనబడితే...గుర్తుపట్టలేకపోయేవాడినే...అయినా ఏం ఘనకార్యం అని...మనిషైనవాడు ఆమాత్రం..."

"ఊఁ...ఏడీ ఒక్కడిని చూపించు, ఎవడికివాడు తన పుచ్చెకాచుకోవడమేకాని...ప్రాణానికి తెగించి..."

"తెగించడాని కేముందీ?"

"ఇలా తేల్చేయడం...నీ వీరహృదయానికి ... వినయానికి లక్షణం."

"నన్ను పొగడకండి."

"పొగడటమా? కృతజ్ఞతను... తెలుపుకోవడం."

"అర్థాణ్ణా ?"

"కాదనడం...నీతరమా ?"

...కోటీ ఎక్కడమేతప్ప...మాటల ప్రయోజనం కనిపించనందువల్ల...వాళ్ళను కరువుదీరా అభినందించనిచ్చి ...సాగనంపి...తలుపుగడియబిగించి...నిట్టూర్పు సగం విడువకముందే, మళ్ళా ఎవరో వచ్చినట్టు...తలుపు ధణల్‌మంది: తీయగా...బొమ్మతీసి పత్రికలకు...అమ్ముకునే...అయ్యర్.

అంతసేపూ—మర్యాదకోసం అరికాలిక్రింద అణచిపెట్టినమంట...ఒక్కమారు నెత్తికి ఎగదట్టింది : రెండుచేతులతో ఆగంతుకుడి రెండుచెవులూ పట్టుకుని...వెనకకు త్రిప్పి...'ఇక్కడనుంచి...మీ ఆఫీసుదాకా...ఎన్ని అడుగులో లెక్కపెట్టుకుంటూ వెళ్ళి...మొత్తం ఎంతో ఉత్తరం వ్రాయి. మెడ మెదిల్చావా...మళ్లా అడుగు వెనక్కువేశావా...నీ ఊపిరి తీశాననుకో...' అనిఖంగ్‌మనేటట్టుగా ఉరిమి మేడ అదిరేటట్టు తలుపు వేసుకున్నాడు...వెంటనే కుర్చీలోపడి—విషం త్రేణుపులుగా...నవ్వునురగలు గ్రక్కుతున్నాడు...'పిరుడు'...ఓహో.

ఉదయాన్నే ఎత్తుకున్న మైకం...ఎండకాస్తూన్నంతసేపూ...తరగనేలేదు : నాలుగుగంటలు దాటినతరువాత ...భోజనంచేయలేదన్న సంగతి జ్ఞాపకంవచ్చి...నిలిచిపోయి ...హోటలుకు పోయి...ఆత్మారాధన సుష్టుగాచేసుకుని...

కాఫీకమ్మదనానికి...నిలువెల్లా కమ్ముకుంటూన్న ఖులాసాతో ...గుమ్మం దిగగానే ఆ అమ్మాయి. .కారులో ఎదురుగా ఉంది: చూసి గిరుక్కున పాన్‌షాపులో కల్పించుకుని...జన సమూహంలో కలిసిపోదామని చూశాడు కాని...'ఆమెను ఇప్పుడు ఏమరించడం నీతరము' కాదని మనసు నచ్చచెప్పినందువల్ల...పళ్ళుబిగివిని...సమీపించాడు. షవ్వర్ తలుపు తీసి ఉంచాడు. ఆమె చేయి చాచి మనసుతో...లోపలికి లాగేసింది...

బాణవేగంతో...ఎన్నోరు చేరుకుంది కారు. కుదిలింపులకుకూడా...చలించకుండా...పీసపాటైనా శరీరాన్ని జరగనీయకుండా...కూర్చున్నాడు.. ఇసుక గుట్టలుగా పేరుకున్న చోటికి...ఇద్దరూ...మౌనంతో...నడచిపోయినారు.

'మూగనోము...మాకన్న మగవాళ్ళుపడితేనే, ముచ్చటగా ఉంటుందిలాగుంది' అని స్వగతానికి ప్రకాశం యిచ్చింది. ఆతడు వంచినతల ఎత్తిచూసి ఊరుకున్నాడు. ఎన్నోమాటలు చెప్పింది...ఎన్నోరకాలుగా కిలకిలలాడింది: ఎన్నోవిధాల నోరూరించాలని...సిగ్గుగా...నిర్భయంగా... ప్రయత్నించి...మౌనాన్ని ఇక సహించలేని చొరవలో... మీదకు వాలింది.

—హుంకరించాడు ... మెడకు చేతులు మెలివేసింది ...విడిపించుకోబోయినాడు...ముఖానికీ, ముఖానికీ తేనెచీను కంత ఎడమన్నా లేదు...విదిలించుకుంటేనేగాని...పీడి ఈవల పడలేదు.

'ఒళ్లు మరచిపోకు'...ఆతనికళ్లు...ఎక్కడో చూస్తున్నవి...పంటల్లో.

'పోను...కాని, మిమ్మల్ని మరవలేను'.

'నీవు...ఎవరు ?'

'విడదీసుకున్న—మీ కౌగిలి నడగండి.'

'వెఱ్ఱిదానా !'

'ఆలా చేసింది...మీరే'.

'నేను చేసినదేమిటో నీ కేం తెలుసు...'

—ఒకదమ్ములో...తన పూర్వగాథకు, ఆమెమనసు విరిగేటంత విషపుపూత పూసి ... భార్యను మ్రింగివేసిన పరమకిరాతుణ్ణి...అని నమ్మించాలని ప్రయత్నంచేశాడు: ఆమె...పెదవులు వడకుతూండగా...విని...విని కన్నీరు రెప్పలతో అప్పళించుకుని...చాలా జాలిగా,

'ఎంత బాధపడ్డారండీ ?'...అంది మారనిమనసుతో.

'బాధ...పెట్టాను'.

'నేను...నమ్మను'.

'పోనీ'.

'...పోనీయను'.

—ఆ రంపకోతభరించలేక...నిబ్బరంగా...సంభాషణ చంద్రోదయంమీదికి త్రిప్పి...ప్రొద్దుపోతూన్నదని జ్ఞాపకం తెప్పించి ఆమె ఎటు..అనుకునేందుకూ పాలుపోనీకుండా యిం

టికి మళ్ళించాడు: కారు పరుగుతీస్తూన్నంతసేపూ, ఎలాగా ఇంకా రంధి పెరగనీక తప్పించుకోవడం అనే ఆలోచనలో పరధ్యానంగా ఉండి, ఊళ్లోకి రాగానే...దోవపోయే ఎవడి వంకనో...స్నేహితుడని చూపిస్తూ...ఆతనితో పని ఉందని ...ఆగేలోపల క్రిందికి దుమికేసి...మందిలో కలిసిపోయి... యింటికి చేరుకున్నాడు.

అలవాటుప్రకారం పేపరు కొని పట్టుకుతెచ్చు కోవడం మరచిపోలేదని...అప్పటికి స్పృహ తెలిసి...పేజీ తిరగ వేయగానే... కొట్టొచ్చే అక్షరాల్లో...తను చేసిన ఘనకా ర్యం ప్రశంస...ఆఫీసుగ్రూప్‌లోనుంచి ... సంగ్రహించిన... తనబొమ్మ !

అంతవరకూ చించి ఆ పేలికతో సిగరెట్ ముట్టించు కుని...జారవిడిస్తే నిశ్శేషం కాదేమోనని... వేళ్లు కాలేదాకా ... రేజా మిగలకుండా. .నుసి కంటచూసి విడిచాడు.

—క్రిందపడివున్న కవరు చించి చూశాడు: దానిలో ...'మేము తెలుగులో మొదటి స్టంట్‌పిక్చర్ తీయ సంక ల్పించాము. అందుకు, మీలాటి వీరులు, మాతో కలిసి పనిచేయడానికి అంగీకరించితే' ఇక ఆపై అక్షరంచూడకుండా ...నలిపేశాడు : వరాలుఇవ్వడానికి చేతగాని దేవతలు... వంచనలకు మాత్రం ముందంజ. కళ్లుమూసుకుపోయినలోకం ...ఏపాట పాడినా...'బాల' తనకళ్ళల్లో మెదులుతూంటే చాలును...గుండె చిట్టం కరగకుండా నిలవడానికి...

రెండురోజులు గడిచినవి. ఆఫీసునుంచి...ఎందుకు రాలేదోఅని కనుక్కునిపోవడానికివచ్చిన జవానుచేతికి రిజైన్

చేసినట్టు వ్రాసియిచ్చి పంపేశాడు. ఆ అమ్మాయి... రెండుమూడుసార్లు వచ్చి...చనవుచేసుకోవాలని ... మీద మీదకు వస్తే...ఆమెకూరిమినంతా...దూదిపింజెలాగా ఎగర గొట్టాడు...కాని, మనసు మార్చుకోదని తెలుసు...తన మనసు ఈ జన్మకు సుఖలాలనలలోకి మారకూడదని... తెలుసు...ఇక చేయవలసింది ?

ఒంట్లో త్రాణ లేకపోయినా...ఘూకుడుగా...దిగి, వీథిలోకి వచ్చి...వచ్చే ట్రాం ముందర...

కళ్ళకు కమ్మినచీకటి విడిపోయేటప్పటికి...డైనమో మూస్‌లాగాఉన్నతల...తలగడలమీద నిలువలేకుండా ఉంది. చీకటిచారికలలోనుంచి...ఆ అమ్మాయి ముఖం...ఆదుర్దా ఓడుతూ...గోడమీది కేలెండరులో...అహాళటికి...పదో నాటి తేదీ...కొట్టొచ్చినట్టు...

పోలీసు జరీచారల తలపాగా రాయడికంఠం...'మీ సాహసానికి ధన్యవాదాలు...మీ రలా ప్రాణానికి తెగించి ...ట్రాముకు అడ్డపడకపోతే...ఆ ఖూనీదారు తప్పించుకునే వాడే—'

పట్టుతప్పి పడివున్న దేహం...మనసును ఆ వీర— కళంకం తమాయించుకోమని...హెచ్చరించినట్లై త్రుళ్ళిపడ టంలో కుట్లు చెదిరి...పిగిలి...నల్లనికాలువ...మొగం కమ్ము కుంటూంది. బాధను గుర్తించడానికి తడుముకునేచేయి కళ్ళకు నెత్తురుపూసింది. చుట్టుప్రక్కల గడబిడ...మళ్లా చీకటి.

చీకటిలో...వెన్నెలగూటిలో...నేరం మరచిపోయి ...చిరునవ్వే...బాల...చిక్కశల్యమై...బాధలు కరగించిన

రూపం...విరిసిపోతూ...మెదడుకు ... అమృతస్నానంతో... తాపం ఆర్చేసి...

—తలపులో వెన్నెలవెలుగు...కన్నులలోకి...జీవమై తన్యజ్యోతిగా తరళించుకుంటూ రెప్పలు ఆర్చడంలో... నెలమారిన తేదీల గడులకాగితం...'గడచిన నెలను కాలం లోకి త్రోసేశాను...ఇప్పుడు నీకు కావలసింది...నేను' అన్నట్టు కొత్త నెత్తురు రంగు అంకెలతో...గాలికి...రెపరెపలాడుతూ ...ఆకర్షించిన చూపు...వాలుకోవడం...ఉద్రేకం నిరంతర సేవాజాగరణంలో చివికి...దోహదమైపోగా లేదీగ సాగిన.... ప్రేమవల్లరి పోలికల...కళ్ళతో...కాచుకునిఉన్న...ఆ అమ్మాయి కవళికలో....ఏకమూర్తిగా ... పెనవేసుకుపోతూ బాల...అందుబాటుచేసి...తానందనిదైపోవడం—

గుండె సారించే...కవర్డ్...శైవసామ్యాన... కంఠ గతంగా కుదించుకుని...పరీక్షాధికారి...ప్రత్యేకం పగబట్టి ఫెయిల్‌చేశాడని తెలుసుకున్నప్పుడు... క్షాత్రంతో బడి చదువు మాని వేసి...పంతం విద్యాస్పర్థతో చెల్లించుకోవా లనుకునే ఫస్టుబాయ్‌లాగా ... పైఅంతస్తుకు...ఉద్ధరించు కోవాలని...

—నరబలం మిగిలిపోయినచేయి...ఆమెవైపుకు... సాగనిచ్చాడు...గుప్‌మన్న దీపం మెఱుపున...ఆతని కను కొలుకుల్లో కుదురుకున్న...నీటిబిందువులతో ణికిసను...చేతికి చేయి కౌగిలిగా యిచ్చి వీరగంధానులేపనంగా పులకలై పోతూన్న...ఆ అమ్మాయిలో...సుమంగళ—కైశికి జలద రించింది. *